క్లుప్తంగా

తీరిన తాగునీటి సమస్య



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో శనివారం వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామ ప్రజలకు తాగునీరు అందించేందుకు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు వచ్చింది. ఈ విషయాన్ని గ్రామస్తులు సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి ఆయన సొంత ఖర్చులను వెచ్చించి మరమ్మతులు చేయించి గ్రామస్తుల తాగునీటి సమస్య తీర్చారు. దీంతో గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి..



ఊట్కూరు: మండలంలోని ఎనకంపేట వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని శనివారం పలువురు కాలనీవాసులు కోరారు. మురుగుకాల్వలు శుభ్రపర్చకపోవడంతో చెత్త పేరుకుపోయిందని తెలిపారు. మురుగుకాల్వలు సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై మురుగునీరు పారుతుందన్నారు. దీంతో రాత్రి వేళలో దోమల బెడద అధికంగా ఉందని అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నారాయణపేట: పట్టణంలో ఆదివారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు 33/11 విద్యుత్ కేంద్రంలో మరమ్మతు కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ మహ్మద్ రఫీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ -2 ఫీడర్ కింద కలెక్టర్ బంగ్లా, ఎస్పీ బంగ్లా, ఆర్టీసీ కాలనీ, సత్యసాయి కాలనీ, టీచర్స్ కాలనీలు, ఆర్డీఓ ఆఫీస్ ఏరియా, శివాజీనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయ ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, వ్యాపారస్తులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

దివ్యాంగుల సంఘం అధ్యక్షుడిగా కెంచె రంగయ్య

ధన్వాడ: దివ్యాంగుల మండల సంఘం అధ్యక్షుడిగా కెంచె రంగయ్య ఎన్నికైయ్యారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెంటయ్య, ఉపాధ్యక్షుడిగా కుర్మన్న, అమ్మక్క, ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ, కార్యదర్శిగా లక్ష్మి, సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, కో–శాధికారిగా శ్రీహరి ఎన్నికైనట్లు నూతన కమిటీ అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మక్తల్: వడ్ల సంచుల లారీ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని మాదన్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఆత్మకూర్ నుంచి రాయచూర్‌కు వడ్లలోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు బోల్తా పడింది. దీంతో చుట్టుపక్కల వారు గమనించి అందులో ఉన్న లారీడ్రైవర్‌ను బయటకు తీసి ప్రమాదం నుంచి కాపాడారు.

మోటార్ వైండింగ్ మెకానిక్ షాపులో చోరీ

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం మూసి ఉన్న మోటార్ వైండింగ్ మెకానిక్ షాపు వద్ద ఉన్న పాత మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కన్నయ్య కొంత కాలంగా బోరు మోటార్ల మరమ్మతుతో పాటు వైడింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం మెకానిక్ షాపును మూసి కిష్టంపల్లి ఆంజనేయస్వామి జాతరకు వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. సాయంత్రం తిరిగి వచ్చి రిపేరుకు వచ్చిన రెండు మోటార్లు కనిపించకపోవడంతో కన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంటలకు 'సోలార్' రక్ష



మాగనూర్ సమీపంలో రైతులు ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ కంచె

- వందల సంఖ్యలో జింకలు
- వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు రైతుల అడుగులు

మాగనూర్: పగలు, రాత్రి తేడా తెలియక సేద్యం చేయడం రైతన్నకు నిత్యకృత్యం. రైతులకు అడుగడుగునా కష్టాలే. విత్తనం వేసింది మొదలు, పంట చేతికి వచ్చే వరకు పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితి. ఆదమరిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. రైతుల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ప్రాణహాని లేని ఆధునిక విధానాల వైపు ఆసక్తి చూపుతున్నారు. దీనిలో భాగంగానే సోలార్ కంచె ఏర్పాటు చేసుకొని పంటలను రక్షించుకుంటున్నారు. వన్యప్రాణుల నుంచి పంటల రక్షణకు సోలార్ కంచె ఎంతో ఉత్తమం అని భావించిన రైతులు వాటి వైపు మొగ్గుచూపుతున్నారు.

ఇది పరిస్థితి..

మండలంలోని అచ్చంపేట, మాగనూర్, పెగడబండ, అడవిసత్యారం, వాడ్వాట్, వర్కూర్, కొత్తపల్లి, కొల్పూర్, మందిపల్లి గ్రామాల్లో ఎక్కువగా ఆటవి సమీప, గ్రామ శివారులోల పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు జింకలు, మేకలు, పశువుల బెడద ఎక్కువగా ఉంటుంది. మొక్కజొన్న, వేరుశనగ పంటలను కాపాడుకునేందుకు సోలార్ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో వన్యప్రాణులతో రైతులు లక్షల్లో నష్టపోవాల్సి వస్తుంది.

10 ఎకరాలకు రూ. 15వేల లోపు ఖర్చు..

10 ఎకరాలకు సోలార్ కంచెను ఏర్పాటు చేసుకోవాలంటే రూ.12నుంచి రూ. 15వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. చుట్టు పక్కల రైతులు కలిసి ఏర్పాటు చేసుకుంటే, ఖర్చు బాగా తగ్గుతుందంటున్నారు. ఒకసారి ఏర్పాటు చేస్తే, అది ఏళ్ల తరబడి పనిచేస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రమాదం లేని రక్షణ..

సోలార్ కంచెను వన్యప్రాణులు, పశువులు తాకిన ఎలాంటి ప్రమాదం ఉండదని అడవి జంతువులు కంచెను తాకినప్పుడు షాక్ కొడుతుంది. దీంతో అవి బెదిరి మళ్లీ పొలాల వైపు రావు. దూరంగా పారిపోతాయి. పశువులకు, జంతువులకు ప్రాణహాని ఉండ దని రైతులు పేర్కొంటున్నారు.

రాయితీ పెంచితే అందించాలి..

ప్రభుత్వం డ్రిప్ పరికరాలకు రాయితీ ఇచ్చినట్లు సౌర కంచెపై కూడా రాయితీ ఇస్తే రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఎకరానికి ప్రభుత్వం గతంలో 50శాతం రాయితీ ఇచ్చేది. అయితే అది కూడా నాలుగు సంవత్సరాల నుంచి నిలిపివేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చొరవ చూపి 80 శాతం నుంచి 90శాతం వరకు సబ్సిడీ ఇస్తే చాలామంది రైతులు ముందుకొస్తారు.

ప్రభుత్వం సబ్సిడీ పెంచాలి..



సోలార్ పెన్సింగ్‌కు గతంలో (నాలుగు సంవత్సరాల క్రితం) ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుండేది. ఇప్పుడు అది కూడా బంద్ చేశారు. దీంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీని 80నుంచి 90 శాతం వరకు పెంచి సబ్సిడీపై సోలార్ అందేలా చూడాలి.

– కిష్టప్ప, రైతు మాగనూర్

జంతువుల బెడద తప్పింది..



పొలం చుట్టు సౌర కంచె ఏర్పాటు చేస్తే పంటకు పశువులు, వన్యప్రాణుల బెడద తప్పింది. సాధరణంగా ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేసుకుంటే రూ. లక్ష ఖర్చు అవుతుంది. సోలార్ కంచెకు రూ. 8వేల ఖర్చు అయింది. కంచె ఏర్పాటు తర్వాత పంట సేనుకు అవసరం లేకుండా పోయింది.

– రాములు, రైతు, మాగనూర్

సోలార్ ఫెన్సింగ్ మేలు..



సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుతో తక్కువ ఖర్చుతో పంటలను రక్షించుకోవచ్చు. ఇప్పటికే కొంత మంది రైతులు సత్ఫాలితాలు సాధిస్తున్నారు. ఈ కంచెతో ఇటు పంట రక్షణతో పాటు వన్యప్రాణులకు ఎలాంటి హాని ఉండదు. ఈ మేరకు రైతుల్లో అవగాహన పెంపొందిస్తాం.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జి ఏఓ మాగనూర్

జాతీయ జెండాను ఎగురవేద్దాం



కృష్ణాలో గాంధీ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

మక్తల్/కృష్ణా: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతి భారతీయుడు వారి వారి ఇండ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గసభ్యుడు కొండయ్య అన్నారు. శనివారం మక్తల్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహన్ని నీటితో శుభ్రం చేశారు. అనంతరం అంబేద్కర్‌కు పూలమాల వేశారు.

–కృష్ణాలో స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే ఉద్దేశంతో బీజేపీ నాయకులు జాతీయ జెండాలను వితరణ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, జిల్లా నాయకులు ఉట్కూర్ భాస్కర్, సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ మేరకు.. హిందుపూర్‌లోని గాంధీ విగ్రహానికి పూజలు చేశారు. ఆయా కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, మాగనూర్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, జయనంద్‌రెడ్డి, నాగరాజుగౌడ్, నర్సప్ప, రవికుమార్‌రెడ్డి, కల్లూరి నాగప్ప, రవికుమార్, శ్రీనివాసులు, నాయకులు రాఘవేంద్ర, మల్‌రెడ్డి, ఆంజనేయులు, గౌరిశంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉచిత చెస్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కోస్గి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ కొనసాగించారు. ఈ శిక్షణను నిర్వాహకుడు ఆనంద్ ప్రారంభించగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో మాత్రమే మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, సంపూర్ణ శిక్షణ అనంతరం విద్యార్థులకు మండల స్థాయిలో చెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సలహాదారు వీరు మల్లేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావోత్సవాలు



పతాకావిష్కరణ చేస్తున్న బాలాజీ

నారాయణపేట రూరల్ : టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావోత్సవాలను శనివారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కే.బాలాజీ జాతీయ పతావిష్కరణ చేసి మాట్లాడారు.. సంఘం ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. హక్కులు బాధ్యతలను సమానంగా స్వీకరిస్తూ అన్ని విషయాలను అధ్యాయనం చేస్తూ సామాజిక స్పృహతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్య, వెంకట్‌నాయక్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో డాక్టర్లను నియమించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న పీవైఎల్ నాయకులు

మద్దూరు: మద్దూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లను నియమించాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రిని పరిశీలించి అక్కడున్న స్టాఫ్‌నర్స్‌లతో మాట్లాడారు. మద్దూరు, దామరగిద్ద, దౌల్తాబాద్ తదితర మండలాలకు చెందిన 80 గ్రామాల ప్రజలకు ఈ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తుంటారు. కానీ ఇక్కడ ఒక్క డాక్టరు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయి డాక్టర్లను, స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, కార్యవర్గ సభ్యులు రవి, రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్‌గా మహ్మద్ అలీ

మద్దూరు: భూసంపత్తి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా పెదిరిపాడ్‌కు చెందిన మహ్మద్ అలీని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పెదిరిపాడ్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఏఈఓ శ్వేత, వ్యవసాయ కేంద్రం జిల్లా మొబిలైజర్ వెంకటయ్య ఆధ్వర్యంలో రైతులు ఎన్నుకున్నారు. ఈ రైతు సంఘం ఆధ్వర్యంలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకు అందజేయనున్నట్లు తెలిపారు.ఎన్నికైన మహ్మద్ అలీకి మాజీ వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, బాలప్ప, రైతులు నరేందర్ రెడ్డి, సురేష్‌రావు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన రాముడు తన సెల్‌ఫోన్ పోయిందని శ్రీరంగాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం శ్రీరంగాపురం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు రాముడుకు ఫోన్ అప్పగించామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



క్యాతన్‌పల్లిలో



ఊట్కూరులో ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

దామరగిద్ద: పవిత్ర శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి, మండల కేంద్రంలోని నగరేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు.. అర్చకులు అభిషేకం మహామంగళ హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మొదటి శ్రావణ మాస శనివార వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కాచూవాగు ఆంజనేయస్వామి, రెనివట్లలోని ఆంజనేయస్వామి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఉత్సవాల సందర్భంగా జల్ది ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతభిషేకం పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. రెనివట్లలో ఉదయం నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ వెంకటయ్య, వెంకట్‌రాములుగౌడ్, రాచప్ప, చెన్నప్ప, తిరుమలప్ప, నర్సింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలో శ్రావణమాసం శనివారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పగిడిమారి, ఊట్కూరు, పెద్దజట్రం, పులిమామిడి, చిన్నపొర్ల ఎడివెల్లి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఎల్‌బీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, ఆకుల పూజా తదితర ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు కృష్ణయ్యగౌడ్, తమ్మిరెడ్డి, వెంకటేష్, నర్సింహడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో జల్ది ఊరేగింపు

ఆంజనేయ స్వామికి జలాభిషేకం



మరికల్: మండల కేంద్రంలోని రాయచూర్ సమీపంలో పడమటి ఆంజనేయస్వామి 2వ వసంతోత్సవాలు శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆలయ కమిటీ సభ్యులు, పల్లకిసేవ నిర్వహించి అభిషేకం, సామూహిక, ఆకుల పూజ నిర్వహించారు. అనంతరం అఖండ భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు వెంకటేశ్వర్లశర్మ, జగన్, రాజేశ్వర్‌రెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, కృష్ణయ్య, రమేష్, పుల్లయ్యగౌడ్, శ్రీనివాస్, కృష్ణచారి, రాజేష్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీ..!



ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ఉన్న రైతు వేదికలో గత బుధవారం దొంగతనం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారి ఏఈఓ స్థానిక పోలీసులకు తెలియజేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. దీంతో అందులో ఉన్న బిరువాను పగుల గొట్టలేదు, కాని వస్తువులు మాయమైనట్లు గుర్తించారు. అయితే దొంగతనం ఇప్పుడే జరిగింద లేక కొన్నిరోజుల కిత్రం వస్తువులను ఎత్తుకెళ్లారా? అనే అనుమానాలు వ్యక్తమవుతుండటంతో విచారణ చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

పోటాపోటీగా కాల్వల పరిశీలన



శనివారం 3ఏ కాల్వను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి



ఈ నెల 6న కేఎల్ఏ 3ఏ కాల్వ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న రైతులు

కాంగ్రెస్‌పార్టీలో మరోసారి బయటపడ్డ వర్గ విభేదాలు

వనపర్తి: సాగునీటి కాల్వల పరిశీలనలో జిల్లా నేతల మధ్య పోటీ పెరుగుతోంది. మొదట పాన్‌గల్ మండలంలోని కాల్వలను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పూడికతీతకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాల్వల చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడం లేదన్న రైతుల అభ్యర్థన మేరకు వారం రోజులుగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులతో కలిసి ఖిల్లాఘనపురం, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని కాల్వలను పరిశీలిస్తూనే ఉన్నారు. శనివారం సైతం ఏఈలతో కలిసి రేవల్లి మండలంలోని సాగునీటి కాల్వలను పరిశీలించారు. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపురం వద్ద ఉన్న 3ఏ కేఎల్ఐ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పూడికతీత పనులను చేయించి నీటిని వదిలినట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేయటంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో మరోసారి వర్గవిభేదాలు బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్యే చొరవతో ఈ నెల 6న పూడికతీత పనులు చేయిస్తే.. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సాగునీరు వదిలారని ప్రచారం చేసుకోవడం ఏమిటనే చర్చ ఎమ్మెల్యే వర్గంలో గుప్పుమంటోంది. రైతుల ఇబ్బందులను చూసి ఎమ్మెల్యే సొంత నిధులతో పూడిక తీయిస్తే.. నీటిని వదిలామంటూ చిన్నారెడ్డి ప్రకటనలు ఇవ్వడమేమిటని ఎమ్మెల్యే వర్గీయులు చర్చించుకుంటున్నారు.

గుంతలమయంగా రోడ్డు

మాగనూర్: మండలంలోని నేరడగం మీదుగా ఉజ్జెల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతలో దారి కన్పించక ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కిందపడి పలువురికి గాయాలైనా సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.



నారాయణపేట రోడ్డు విస్తరణ చేయాలి..

మక్తల్: మక్తల్ నుంచి నారాయణపేట వరకు రోడ్డు విస్తరణ చేయాలని సీపీఎం జిల్లా వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును విస్తరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏరియ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, గోవింద్‌రాజ్, లక్ష్మణ్, సూర్యప్రకాష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



కొత్తకోట: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో సంభవించిన వరద బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని వ్యాపారస్తుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రకృతి విపత్తు కారణంగా వందలాది మంది చనిపోవడంతో తమ వంతు సహాయంగా విరాళాలు అందజేసిన వ్యాపారస్తులకు భవన నిర్మాణ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. సేకరించిన విరాళం మొత్తాన్ని త్వరలోనే కేరళకు వెళ్లి అక్కడి సీఐటీయూ నాయకులు అందజేస్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, జనార్దన్, అస్కని శ్రీనివాసులు, ఆశన్న, వెంకటయ్య, గొల్ల వెంకటయ్య, కుర్మన్న, బాలకృష్ణ, నాగన్న, పెద్ద రాములు, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.